క్లుప్తంగా

రైతులు ధాన్యం భద్రపర్చుకోవాలి

సీతానగరం: మూడురోజుల తేలికపాటి, భారీ వర్ష ప్రభావం ఉన్నందున రైతులు కోసిన వరిచేలు, నూర్పు చేసిన ధాన్యం వర్షానికి తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎ. ఉమామహేశ్వరరావు, ఏఓ ఎస్.అవినాష్ కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ వాతావరణ శాఖ మూడురోజులు వర్షాలు కురుస్తాయని ప్రకటించడంతో కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అన్నిగ్రామాల్లో రైతులు కోసిన వరిచేలు, నూర్పిడి చేసిన ధాన్యాన్ని తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులతో గ్రామాల్లో రైతులకు పలుసూచనలు అందజేసినట్లు చెప్పారు.

లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదిఒడ్డున వెలసిన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామివారికి ముడుపుల పూజలు గురువారం ఘనంగా జరిగాయి. లక్ష్మీనృసింహ స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు వేకువజాము నుంచి క్యూలో నిలబడి స్వామివారికి అభిషేకాలు చేసిన అనంతరం కోరిన కోర్కెలు సిద్ధిస్తాయన్న నమ్మకంతో స్వామివారికి 9 వారాల ముడుపుల పూజలు నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి పూజల్లో పాల్గొన్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు, అర్చకులు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

శిక్షణను సద్వినియోగం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

బలిజిపేట: సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై పొందిన రెండు రోజుల శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులకు 9రకాల థీమ్స్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సూచించిన ప్రకారం, జిల్లా నుంచి వచ్చిన డీఆర్‌పీలు ఇచ్చిన శిక్షణలో సూచనలు అన్నింటిని అమలు చేయాలని సూచించారు. పల్లెలు అభివృద్ధి చెందాలంటే ప్రణాళికలు అవసరమని ఆ ప్రకారం అభివృద్ధి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్పీలు, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం



దుకాణాలలో అవగాహన కల్పిస్తున్న లేబర్ అధికారి వెంకట్రావు

పార్వతీపురంటౌన్: బాలకార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని లేబర్ అధికారి వెంకట్రావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో గురువారం పలు దుకాణాలను ఎస్సై సురేష్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో 18 సంవత్సరాల లోపు వయస్సు వారిని పనిలో ఉంచరాదని సూచించారు. బాలలను కార్మికులుగా పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది ఆర్ హరి, అనిల్, కె. అతుల్, క్రాంతి పాల్గొన్నారు.

సారా జోరు

- పట్టణం, గ్రామాల్లో పుష్కలంగా లభ్యం
- దాడులు చేసినా ఆగని వ్యాపారం





పార్వతీపురం కలెక్టరేట్ సమీపంలో తాగి పడేసిన సారా ప్యాకెట్‌లు

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రం పార్వతీపురంలో మంచినీళ్ల కంటే సారా పుష్కలంగా దొరుకుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సారా అమ్మకాలు జోరందుకున్నాయి. కొందరు నాయకుల అండతో ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నారు. ఫోన్‌కొడితే చాలు క్షణాల్లో సారా ప్యాకెట్లను డోర్ డెలివరీ చేస్తున్నారు. పట్టపగలు జనావాసాల మధ్యనే సారా యథేచ్ఛగా అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో గ్రామాల్లో తక్కువగా సారా అమ్మకాలు జరిగేవి. ప్రస్తుతం పోటాపోటీగా సారా వ్యాపారం సాగిస్తున్నారు. ఒక్కో ఊర్లో రెండు మూడు చోట్ల సారా విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం. పార్వతీపురం ఎక్సైజ్ శాఖ పరిధిలో కొమరాడ, పార్వతీపురం, పార్వతీపురం అర్బన్ మండలాలు వస్తాయి. ఎస్ఈబీ వ్యవస్థ నుంచి ఎక్సైజ్‌గా మార్పు చెందాక అధికారులు మద్యంపై క్కువగా నిఘా పెట్టడంతో సారా కేసులు చాలా తక్కువగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సారా తయారీకి అవసరమైన బెల్లం యథేచ్ఛగా రవాణా అవుతోంది. కొమరాడ, పార్వతీపురం మండలాల్లో గల ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో పెద్దఎత్తున సారా తయారీ జరుగుతోంది. అక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు ప్యాకెట్లు, క్యాన్‌ల రూపంలో సరఫరా చేస్తున్నట్లు తెలిసింది.

దాడులు చేసినా ఆగని జోరు

ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ అధికారులు సారా తయారీదారులు, విక్రేతలపై దాడులు చేస్తున్నా పల్లెలు, పట్టణంలో సారా జోరు తగ్గడం లేదు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నా వారం రోజుల వ్యవధిలో బయటకు వచ్చి మళ్లీ వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో సారా అమ్మకాలు చేస్తున్న వారిపై దాడులు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిగిలిన వారిపై నామమాత్రంగా దాడి చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో చాలామంది సారాకు బానిసలుగా మారారు. రోడ్ల వెంట, పొలాలు, గుడి, బడి తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడే సారా తాగుతున్నారు. దీంతో ఖాళీ ప్యాకెట్లు ఎక్కడ చూసినా కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

ఎప్పటికప్పుడు కేసుల నమోదు

పార్వతీపురం ఎక్సైజ్ పరిధిలో ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తున్నాం. ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించి, సారా బట్టీలు ధ్వంసం చేస్తున్నాం. పట్టణం, గ్రామాల్లో సారా అమ్మకాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. ప్రజలు తమ పరిధిలో సారా అమ్మకాలు చేపడితే తక్షణమే ఎక్సైజ్ సిబ్బందికి సమాచారం అందించాలి. -కె. సురేష్, ఎక్సైజ్ సీఐ, పార్వతీపురం

సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



కృష్ణారాయపురంలో మాట్లాడుతున్న ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు

సీతానగరం: గ్రామాల్లో జరుగుతున్న సైబర్ నేరాలు, రోడ్డుప్రమాదాలు, మాదక ద్రవ్యాల విక్రయాల నివారణకు ప్రజలు సహకరించాలని ఏఎస్సై లంక శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పోలీసులు గ్రామాల్లో నిర్వహిస్తున్న 'సంకల్పం' కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కృష్ణారాయపురంలో ఎస్సై ఎం.రాజేష్ పర్యవేక్షణలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్న కారణంగా తమఫోన్‌లో వచ్చిన ఓటీపీ నంబర్, ఆధార్ నంబర్ ఎవరికీ తెలియచేయరాదని సూచించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారు విధిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ లేకుండా వాహనాలపై ప్రయాణం చేసే సమయంలో ప్రమాదాలు జరిగితే తలకు గాయాలై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామాల్లో వాహన చోదకులకు అవగాహన కల్పించడానికి సంకల్పం సదస్సులు దోహద పడుతున్నాయన్నారు. గ్రామాల్లో నేరాలు నివారించడానికి ముందుగా మహిళలు చైతన్యవంతులు కావాలని కోరారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలల నిర్మాణం వేగవంతం చేయాలి



గోశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు

సీతానగరం: మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో మంజూరు చేసిన గోశాలల పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ పి.త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు ఆర్.వెంకంపేటలో పాడిరైతు ఆర్.విజయలక్ష్మి స్వస్థలంలో నిర్మిస్తున్న గోశాలను ఆయన గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి మొదటి విడతగా 24 గోశాలలు, రెండవవిడతలో 26 గోశాలలు మంజూరు చేశామన్నారు. మొదటి విడతలో మంజూరుచేసిన గోశాలల నిర్మాణం వివిధ స్థాయిల్లో ఉందని తెలియజేశారు. రెండవవిడతాలో మంజూరు చేసిన లబ్ధిదారులు సూచించిన స్థలాల్లో నిర్మాణాలకు మార్కింగ్ ఇచ్చామని, పాడి పశువులున్న రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని గోశాలల నిర్మాణానికి నిధులు మంజూరుచేశామని తెలిపారు. దీంతో ముందుగా ప్రారంభించిన నిర్మాణాలు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని, పూర్తిచేసిన వారికి బ్యాంక్ ఖాతాల్లో బిల్లులకు సంబంధించిన నగదు జమ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, ఇంజినీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపరచాలి



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: జిల్లాలో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే విజయచంద్ర సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన క్యాంప్ ఆఫీసులో ఆర్టీసీ అధికారులు, డీఎం కనకదుర్గ ఎమ్మెల్యేను కలిశారు. ఈ నెల 21న మంత్రి రాంప్రసాద్ రెడ్డి జిల్లా కేంద్రంలో కొత్త బస్సులు ప్రారంభించనున్న కార్యక్రమానికి అధికారులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా అధికారులతో ఎమ్మెల్యే వివిధ అంశాలపై చర్చించారు. పల్లె ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందించాలని, అలాగే కాంప్లెక్స్ ఇతర చోట్ల సౌకర్యాలు మెరుగుపడాలని సూచించారు. ఇంకా ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది? తదితర అంశాలపై ఎమ్మెల్యే చర్చించారు. మంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

రైతులను అప్రమత్తం చేయడంలో అధికారులు అలసత్వం



కుప్పలు వేసి టార్పాలిన్లు కప్పిన చేను

సాలూరు రూరల్: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మండలంలోని రైతులను అప్రమత్తం చేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శించారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. తుఫాన్ హెచ్చరికలు టీవీల్లోను, వార్తా పత్రికల్లో చూసిన వారు ముందస్తు జాగ్రత్తలు కొంతవరకు తీసుకున్నారు. అయితే కొంతమంది నిర్లక్ష్యరాస్య రైతులు మాత్రం వాతావరణ పరిస్థితులు తెలియక కోతలు కోశారు. అయితే ముందస్తుగా మబ్బులు వేయడంతో వీలైనంతవరకు రైతులు కోసిన పంటను కుప్పలుగా వేసి రక్షిచుకోగలిగామని అధికారులు హెచ్చరికలు చేసి ఉంటే పంట కోసేవారం కాదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుత తుఫాను 5 రోజుల పాటు కొనసాగుతుందని హెచ్చరికలు ఉండడంతో కుప్పలు వేసిన చేలు తేమశాతం పెరిగి నాణ్యత లోపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

పార్వతీపురం టౌన్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సంపూర్ణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం.శ్రీరాములు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ ప్రథమ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో ఉదయం 6.30 గంట నుంచి 7.30 గంటల వరకు అంతర్జాతీయ ప్రథమ ధ్యాన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లాలోని యోగాసన అభ్యాసకులు, యోగా గురువులు, యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, అధికారులు, స్థానికులు పాల్గొంటారని చెప్పారు.

విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పరిశీలన



హెల్త్‌స్క్రీనింగ్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న వైద్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: విద్యార్థుల్లో ఆరోగ్యపరమైన సమస్యలు ముందస్తుగా గుర్తించడానికి నిర్వహిస్తున్న హెల్త్ స్క్రీనింగ్ జరుగుతున్న తీరును వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డా.రఘుకుమార్‌లు గురువారం పరిశీలించారు. ఈ మేరకు పట్టణంలోని 23వ వార్డులో సంస్కృతఉన్నత పాఠశాల, 19 వార్డులో ఎంజేపీఏపీ బీసీ సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య పరీక్షలు, స్క్రీనింగ్ వివరాలు రికార్డులో తనిఖీ చేసి ఆన్‌లైన్ నమోదు తీరును పరిశీలించారు. వైద్యారోగ్య శాఖ నిర్దేశించిన చెక్ లిస్ట్ ప్రొఫార్మా ప్రకారం అధికారులు అక్కడ స్క్రీనింగ్ వివరాలపై ఆరా తీసి నమోదు చేశారు. స్క్రీనింగ్‌కు అవసరమైన పరికరాలు, కిట్లు సిద్ధంగా ఉన్నాయా? ఆరోగ్య నివేదికలు కచ్చితంగా నమోదు చేస్తున్నారా? మొత్తం విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, ఇప్పటివరకు ఎంత మందికి స్క్రీనింగ్ పూర్తి చేశారు? వారిలో ఆరోగ్య సమస్యలు, వ్యాధులు, వైకల్యం, పుట్టుక లోపాలు ఇతర అనారోగ్య సమస్యలతో ఎంత మందిని గుర్తించారు? వైద్యాధికారి ఎంతమందికి చికిత్స అందజేశారు, ఎంత మందిని దగ్గర్లో ఉన్న పీహెచ్‌సీ లేదా ఉన్నత ప్రభుత్వ ఆసుపత్రి, డీఈఐసీకు రిఫర్ చేశారు? తదితర వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి.హేమసుందర్ నాయుడు, మహమ్మద్ షకీల, హెల్త్ సూపర్వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది విజయ, సావిత్రి, స్టాఫ్ గౌతమి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పుట్టిన రోజును పండగలా నిర్వహిద్దాం

- మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజును పండగలా నిర్వహిద్దామని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం నియోజకవర్గ పార్టీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 21 తేదీన శనివారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాలు, నియోజకవర్గ స్థాయిలో పలు సేవా కార్యక్రమాలు, కేక్ కటింగ్ నిర్వహించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంతా సిద్ధం కావాలని కోరారు. బలిజిపేట, సీతానగరం మండల కేంద్రాల్లో గల వైఎస్సార్ విగ్రహాల ఉదయం 8:30 గంటలకు ఆయా మండలాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కేక్ కట్ చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మూడు మండలాల నాయకులు నియోజకవర్గ కేంద్రంలో గల వైఎస్సార్ విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కేక్ కటింగ్, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారని, అలాగే పార్వతీపురం మండలం, అర్బన్ వైఎస్సార్‌సీపీ శ్రేణులు అందరు ఉదయం 10 గంటలకు ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గల వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుచుని అందరూ కలిసి జగనన్న పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించుకోనున్నామని తెలిపారు. కావున పార్వతీపురం నియోజకవర్గ వ్యాప్తంగా గల పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ కూడా తప్పకుండా మన పార్టీ అధినేత వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. సమావేశంలో మూడు మండలాలు, పురపాలక సంఘం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, పాలవలస మురళీకృష్ణ, జెడ్పీటీసీలు అలజంగి రవికుమార్, బలగ నాగేశ్వరరావు, బలగ శ్రీరాములనాయుడు, మజ్జి శేఖర్ వైస్ ఎంపీపీ బి.రవికుమార్, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సీనియర్ నాయకులు మడక విశ్వనాథం, కురిటి వెంకటరమణ, పెద్దింటి లత తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు వెనక్కుతీసుకోవాలి

బలిజిపేట: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని దళిత బహుజన సేవా సంఘం ఉపాధ్యక్షుడు ఎస్. కామేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన బలిజిపేటలో విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్‌పై, దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

బాలికల రక్షణపై అవగాహన తప్పనిసరి

పార్వతీపురంటౌన్: బాలికల రక్షణపై అవగాహన తప్పనిసరి అని జీఆర్‌పీ హెచ్‌సీ రత్నకుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం రైల్వేస్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఒంటరిగా బాలికలు సంచరించినట్లయితే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంట్లో వివాదాలు జరిగి కొంతమంది ఇళ్లు విడిచి వచ్చేస్తుంటారని, అలాంటి వారు అనుమానా స్పదంగా తిరిగినట్లు కనిపించినా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలికలకు మాయమాటలు చెప్పి, స్టేషన్ వద్ద తీసుకువచ్చి భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉన్నా సమాచారం ఇవ్వాలని కోరారు. బాలల సంరక్షణకు 1098 హెల్ప్‌లైన్ ద్వారా తెలియజేయగలరని వివరించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం మళ్లీ వాయిదా

- హాజరు కాని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు
- విలువ లేకపోవడమే కారణమని అసహనం



మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు హజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



మండల సమావేశం వాయిదా వేస్తున్న ప్రకటిస్తున్న శివరాంపురం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ కళ్లేపల్లి త్రినాథ

సాలూరు రూరల్: ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు విలువలేని సమావేశాలకు ఎందుకు హాజరు కావాలని ప్రశ్నిస్తూ మండల సమావేశానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. దీంతో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం మరోమారు వాయిదా పడింది. గ్రామసభలలో సైతం టీడీపీ నాయకులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తూ స్థానికంగా ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు విలువ లేకుండా కూటమి నాయకులకు వత్తాసుపలుకుతూ అధికారులు వ్యవహరిస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ ప్రజాప్రతినిధులు ఆరోపిస్తున్నారు. గురువారం జరగాల్సిన సమావేశం వాయిదా పడిందని మరో మూడు నెల్లో ఎప్పుడు నిర్వహించనున్నది తెలియజేయనున్నట్లు శివరాంపురం ఎంపీటీసీ ప్రకటించారు.

విలువ లేని సమావేశాలెందుకు?

గ్రామసభల్లో తీర్మానాలను సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా చేయడంతో పాటు కూటమి నాయకులు అంతాతామై వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికారపార్టీ వ్యవహారశైలిపై పలుమార్లు గ్రీవెన్స్‌సెల్‌లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఫిర్యాదులు చేశారు. అయినా వారి తీరు మారకపోవడంతో తమతో పనిలేనప్పుడు మరి సమావేశాలకు హాజరై ప్రజలకు ఏ విధంగా మేలు చేయగలుగుతామో అర్థం కాక మండల సమావేశాలకు హజరుకావడం లేదని సర్పంచ్‌లు ఎంపీటీసీలు చెబుతున్నారు. ఇటీవల జరిగిన గ్రామసభలలోను, అలాగే కొన్ని అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలలోను స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం స్పష్టంగా కనిపించిన విషయం తెలిసిందే. గ్రామాలలో అభివృద్ధి పనులు పార్టీలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలను అన్ని పార్టీలను కలుపుకుంటూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగిందని ప్రస్తుతం కూటమి నాయకులు మాత్రం అంతా తామే అంటూ వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే విధంగా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇలాగే ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం తీరు ఉంటే ప్రజలకు మేలు జరగదని ఈ విషయంలో ఉన్నతాధికారులు కల్పించుకోవాల్సిన అవసరం ఉందని పలువురు మేధావులు సూచిస్తున్నారు.

డిప్యూటీ సీఎం వస్తున్నారని..!

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- హడావుడిగా జరిపిస్తున్న పనులు

మక్కువ: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ శుక్రవారం మక్కువ, సాలూరు మండలాలకు చెందిన పలు గిరిజనగ్రామాల్లో రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన నిమిత్తం పర్యటించనుండడంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై పనులు శరవేగంగా జరిపిస్తున్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని బాగుజోల గ్రామానికి పార్వతీపురం మన్యం జిల్లా అడిషనల్‌ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కె.థామస్‌రెడ్డి, డ్వామా పీడీ రామచంద్రరావు, ఐటీడీఏ ఈఈ మణిరాజ్, సీఐ రామకృష్ణలు చేరుకుని, ఏర్పాట్ల పనులను పర్యవేక్షించారు.

హడావిడిగా శిలాఫలకాల నిర్మాణం

డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో అధికారులు హడావిడిగా శిలాఫలకాల పనులును గురువారం జరిపిస్తున్నారు. శిలాఫలకాల నిర్మాణం గురువారం సాయంత్రానికి ఇంకా కొనసాగుతుండడంతో, ఇంతవరకు పనులు జరిపించకపోతే, ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.



బాగుజోల గ్రామం వద్ద శిలాఫలకం పనులు జరిపిస్తున్న దృశ్యం

శరవేగంగా రహదారిపై గోతుల పూడ్చివేత

మక్కువ నుంచి దుగ్గేరు గ్రామం మధ్య ఏర్పడిన గోతులను అధికారులు హడావిడిగా పూడ్చివేస్తున్నారు. గోతులలో రాళ్లపిక్కలతో కూడిన మెటిరియల్ వేసి, చదును చేయిస్తున్నారు.



మక్కువ, దుగ్గేరు రహదారుల మధ్య గోతులను పూడ్చి వేస్తున్న దృశ్యం



రక్షిత మంచినీటి పథకంలోకి నీరు ఎక్కించేందుకు పనులు జరిపిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు